భద్రతా వలయంలో మీనంబాక్కం

● తిరుచ్చి, కోవైల్లో ముమ్మర తనిఖీలు


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న రక్షణ దళం


ప్రత్యేక మాస్కులతో భద్రతా దళం ప్రదర్శన


విమానాశ్రయ సమీపంలో తనిఖీలు జరుపుతున్న పోలీసులు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత్ - పాకిస్థాన్ దేశాల నడుమ యుద్ధం సైనిక సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో మీనంబాక్కంలోని జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలు, తిరుచ్చి, కోయంబత్తూరు, మదురై విమానాశ్రయాల్లో భద్రత పెంచారు. ఈ విమానాశ్రయాలలో భద్రతాధికారులు డేగకళ్లతో నిఘా వేస్తున్నారు. అంతేకాకుండా సెలవుపై వెళ్ళిన ఉద్యోలందరినీ విధుల్లో చేరాలని అత్యవసర సందేశాలు కూడా పంపించారు. భారత్- పాక్ సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రాల్లో ఇప్పటికే విమానాశ్రయాలను మూసివేశారు. అదే సమయంలో చెన్నై మీనంబాక్కం విమానాశ్రయం నుండి ఇతర రాష్ట్రాలకు విదేశాలకు వెళుతున్న విమానాల సంఖ్యను క్రమంగా తగ్గిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం వేకువజాము నుంచి మీనంబాక్కంలో రెండు విమానాశ్రయాల వద్ద భద్రతను మరింతగా పెంచారు. విమాన ప్రయాణికులు, సందర్శకులను మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే లోపలకు అనుమతిస్తున్నారు. ఈ విమానాశ్రయంలో పనిచేస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సభ్యులు, పోలీసులు, విమానాశ్రయ భద్రతా విభాగం సిబ్బంది తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ సెలవు పెట్టకూడదని శుక్రవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విమానాశ్రయం లోపలకు ద్రవ పదార్థాలను, పౌడర్లను వెంట తీసుకుని రాకూడదని, ఆధార్ తదితర గుర్తింపు కార్డులను తప్పకుండా తీసుకురావాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ప్రయాణికుడిని తనిఖీ చేస్తున్నారు. ఇక విమాన ప్రయాణికులతోపాటు వచ్చే సందర్శకులకు అధికారులు తాత్కాలికి విజిటింగ్ పాసులిచ్చే పద్ధతికి కూడా స్వస్తిపలికారు. విమానాశ్రయాలలో ప్రయాణికులకు తనిఖీ చేసే ప్రాంతం వద్ద మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. విమానాలకు ఇంధనాన్ని నింపి ప్రాంతాలపై కూడా అధికారులు నిఘా వేస్తున్నారు. ఇదే రీతిలో తిరుచ్చి, కోయంబత్తూరు, మదురై విమానాశ్రయాల్లోనూ అధికారులు డేగ కళతో నిఘా వేస్తున్నారు.

మాక్ డ్రిల్...

విమానాశ్రయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర విపత్తుల నిర్వహణ బృందం, రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం, విమానాశ్రయ భద్రతా విభాగం ఉన్నతాధికారులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రయాణికులు, విమానాశ్రయాల సిబ్బందిని యుద్ధపరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలు గురించి మాక్‌డ్రిల్ సభ్యులు వివరించారు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ సభ్యులు, కమెండోలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ముఖాలకు రసాయన నిరోత మాస్కులు వేసుకుని సైనికులు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

వైభవంగా మీనాక్షి అమ్మవారి మహారథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

● పులకించిన భక్తజనం ● సప్పరాల్లో ఊరేగిన గణపతి, మురుగన్, నాయన్మార్లు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): మదురై సామ్రాజ్ఞిగా పట్టాభిషిక్తురాలై, సుందరేశ్వరుడితో పోరు సల్పి దిగ్విజేతగా నిలిచి, ఆ స్వామివారినే పరిణయమాడిన మీనాక్షి అమ్మవారు పతిదేవుడితో మహారథంపై ఊరేగి భక్తులను అనుగ్రహించారు. గత నెల 29న ధ్వజారోహణంతో ప్రారంభమైన మదురై మీనాక్షి అమ్మవారి చిత్తిరై ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. అదే సమయంలో అలగర్ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మీనాక్షి అమ్మవారి రథోత్సవం కనులపండువగా ప్రారంభమైంది. వేకువజాము 4 గంటలకు మీనాక్షి, సుందరేశ్వరులు ముత్తంబళ ముదలియార్ కట్టలై మండగపడి, రామనాథపురం సేతుపతి మహారాజ మండగపడిలో వేంచేయగా, ప్రత్యేక పూజలు జరిగాయి. అక్కడి నుండి ఆదిదంపతులను తూర్పు మాసి వీధిలోని రథమండప ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. మహాదీపారాధన తర్వాత సుందరేశ్వర స్వామిని పెద్ద రథంలో, మీనాక్షి అమ్మవారిని చిన్న రథంలో ఉంచారు. రథోత్సవాన్ని ప్రారంభించడానికి ముందుగా కరుప్పణ్ణసామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 6 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. భక్తులంతా డప్పులు, ఢమరుకాలు, చండీ మేళాలు వాయిస్తూ దారిపొడవునా పరమేశ్వరుడి వేషధారులంతా నృత్యాలు చేస్తూ వెళ్ళారు. పెద్ద రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్ళను పట్టుకుని భక్తులు 'మదురై మీనాక్షి వర్ధిల్లాలి... సుందరేశ్వరస్వామి వర్ధిల్లాలి' అంటూ రథాన్ని లాగుతూ వెళ్లారు. రథాలకు ముందుగా పట్టపుటేనుగు నడచి వెళ్ళింది. ఆ తర్వాత విఘ్నేశ్వరుడు, మురుగన్, నాయన్మార్లు వేర్వేరు సప్పరాల్లో ఊరేగింపుగా వెళ్ళారు. రెండు రథాలూ నాలుగు మాసి వీధుల్లో ఊరేగిన తర్వాత రథమండప ప్రాంతాలకు చేరాయి. ఆ తర్వాత చండీకేశ్వరుల ఊరేగింపు జరిగింది. రథోత్సవంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన లక్షలాదిమంది భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం ముగిసిన తర్వాత సాయంత్రం స్వామి, అమ్మవార్లు సప్తవర్ణ సప్పరంలో మాసి వీధుల్లో ఊరేగారు. శనివారం మధ్యాహ్నం ఆలయం వద్దనున్న పొత్రామరై కుళంలో తీర్థవారీ వేడుకలు జరుగుతాయి. రాత్రి 10.15 గంటలకు తిరుప్పరం కుండ్రం సుబ్రహ్మణ్యస్వామి, దేవసేన, పవళకనివాయన్‌లు 16 కాళ్ల మండపం నుండి స్వస్థలానికి బయలుదేరుతారు. ఆ కార్యక్రమంతో మీనాక్షి అమ్మవారి ఆలయ చిత్తిరై వేడుకలు ముగియనున్నాయి.


మదురై మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వరర్ సమేత మీనాక్షిదేవి

విద్యుత్ సరఫరా నిలిపివేత...

రథోత్సవం సందర్భంగా మదురై నగరంలో విద్యుత్ బోర్డు అధికారులు రహదారుల్లో హైటెన్షన్ విద్యుత్ తీగెలను తొలగించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మీనాక్షి అమ్మవారి ఆలయం చుట్టూ విద్యుత్ స్తంభాలను తొలగించి భూగర్భంలో విద్యుత్ కేబుల్ పనులు గత ఐదేళ్లుగా నత్తనడక నడుస్తున్నాయి. చిత్తిరై ఉత్సవాల రథోత్సవం రోజు మదురై నగరమంతటా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో స్థానికులు ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు తీవ్ర ఇబ్బందులకు గురికావటం ఆనవాయితీగా మారింది. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి, ఎంపీ, ఇతర అధికారులు భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటుపై ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదని మదురై నగరవాసులు ఆరోపిస్తున్నారు.



తిరుచ్చి పంజప్పూరులో బస్ టెర్మినల్‌ను ప్రారంభించి కొత్త బస్ సర్వీసులకు పచ్చజెండా ఊపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అభివృద్ధిపథంలో రాష్ట్రం


● ఇక డీఎంకే ద్రావిడ తరహా పాలన 2.0
● తిరుచ్చి సభలో సీఎం స్టాలిన్

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): గడిచిన నాలుగేళ్లలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని, మహిళాభ్యుదయానికి, విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని, వచ్చే యేడాది నుంచి డీఎంకే ద్రావిడ తరహా పాలన 2.0 ప్రారంభమవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తిరుచ్చి జిల్లా పంజప్పూరులో విమానాశ్రయాన్ని తలపించేలా ఏసీ సదుపాయంతో కూడిన కలైంజర్ బస్ టెర్మినల్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఆ సందర్భంగా జరిగిన సభలో లబ్దిదారులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఈ జిల్లాకు చెందిన మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ తమ శాఖలపైనే దృష్టి పెట్టకుండా తాము ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల అభివృద్ధికి కూడా తీవ్రంగా కృషిచేయడం తనకెంతో నచ్చిందన్నారు. గత నాలుగేళ్లలో తిరుచ్చి జిల్లాల్లో పలు పథకాలు అమలు చేశామని, జల్లికట్టు స్టేడియం నిర్మాణం, రూ.4.27 కోట్లతో పచ్చమలై పర్యాటక పథకం, 1100 ఎకరాల విస్తీర్ణం కలిగిన సిప్కాట్ తన చేతులమీదుగా ప్రారంభమయ్యాయని చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పదేళ్లలో అమలు చేయనున్న పథకాల జాబితాను తిరుచ్చి నగరంలో ఏర్పాటైన ఎన్నికల ప్రచార సభలో ప్రకటించి ద్రావిడ తరహా పాలనకు శ్రీకారం చుట్టానని చెప్పారు. నాలుగేళ్లలో రాష్ట్రానికి పారిశ్రామిక పరంగాను అభివృద్ధిపరచామని, ఇక రానున్నది ద్రావిడ తరహా పాలన 2.0 అని, ఆ పాలనలో మరిన్ని పథకాల ద్వారా ప్రజలు లబ్ది పొందనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్, సీవీ మెయ్యనాథన్, ఎంపీ తిరుచ్చి శివ, నగర మేయర్ ఎం.అన్బళగన్, జిల్లా కలెక్టర్ ఎం.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా పుట్టినరోజు వేడుకలకు ఎవరూ రావొద్దు

సైనికుల కోసం ప్రార్థించండి

అన్నాడీఎంకే శ్రేణులకు ఈపీఎస్ పిలుపు



ప్యారీస్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీ తన పుట్టిన రోజు సందర్భంగా తనను కలిసేందుకు ఎవరూ రావొద్దని, ఆడంబర వేడుకలు జరుపుకోరాదని, ఆ రోజు భారతదేశప్రజలను కాపాడేందుకు పోరాడుతున్న మన సైనికుల కోసం ప్రార్థించాలని అన్నాడీఎంకే శ్రేణులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) హితవు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన ఎక్స్‌పేజీలో సూచించారు. 'ఆపరేషన్ సిందూర్' పేరిట దాయాది దేశం పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెబుతున్న భారతీయ సైనికులకు, వారిని ప్రోత్సహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, యుద్ధానికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్న కేంద్రప్రభుత్వానికి రాష్ట్రప్రజానీకం తోడుగా వుండాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సమయంలో తన పుట్టినరోజు సందర్భంగా పార్టీ శ్రేణులెవరూ తనను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు రావొద్దని, ఆ రోజు రక్తదానం, అవయవ దానం, ఉచిత వైద్యశిబిరాలు, సంక్షేమ సహాయాలు పంపిణీ చేయాల్సిందిగా ఈపీఎస్ సూచించారు. భారతీయ సైనికులు విజయం సాధించాలని ఆలయాలు, మసీదులు, చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించాలని ఈపీఎస్ అన్నాడీఎంకే కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

పాక్‌ను చావుదెబ్బ కొట్టాల్సిందే

● మాజీ సైనికులు

అడయార్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, వారిని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను చావుదెబ్బ కొట్టాల్సిందేనని రాష్ట్రానికి చెందిన పలువురు మాజీ సైనిక ఉన్నతాధికారులు ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. నగరంలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కేవలం ఒక వ్యక్తి (పాక్ ఆర్మీ చీఫ్) దుందుడుకు చర్య వల్లనేనన్నారు. ఆయన పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఏదోవిధంగా తన సర్వీసు పొడిగించుకునేందుకు ఈ తరహా కుట్ర చేశారన్నారు. సాధారణంగా భారత్ ఎప్పటిలాగే తేలికగా తీసుకుంటుందని అంచనా వేశారని, కానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కన్నెర్రజేయడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందన్నారు. కేంద్రం అనుమతితో భారత బలగాలు తొమ్మిది చోట్ల మెరుపుదాడులు చేశాయని వారు గుర్తు చేశారు. పాకిస్థాన్ యుద్ధక్షేత్రంలో 5 రోజులకు మించి నిలబడలేదన్నారు. ఇక మన విషయానికి వస్తే, భారత సైన్యం తన అమ్ముల పొదిలో ఉన్న ప్రధాన ఆయుధాలను ఇంకా బయటకు తీయలేదన్నారు. మన సైన్యానికి సమాచార వ్యవస్థ అత్యంత బలంగా ఉందన్నారు. గురువారం ఒక్కరోజులోనే పాకిస్థాన్ ఏకంగా 450 డ్రోన్లను ప్రయోగించగా,వాటిని భారత సైన్యం నిర్వీర్యం చేసిందన్నారు. ఏం జరిగినా మన దేశ సైన్యాన్ని మాత్రం విమర్శించవద్దని వారు విజ్ఞప్తి చేశారు.


మీడియా సమావేశంలో మాజీ సైనికాధికారులు, బీజేపీ నేతలు

కలైంజర్ లైబ్రరీకి రండి

● విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి పిలుపు

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): పుస్తకాల ద్వారా ప్రపంచాన్ని అధ్యయనం చేసేందుకు కలైంజర్ లైబ్రరీకి రావాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి విద్యార్థులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి తన ఎక్స్ పేజీలో... కలైంజర్ సెంటినరీ వేడుకలను పురస్కరించుకుని చెన్నై వెస్ట్ జిల్లా అన్నానగర్ నియోజకవర్గంలో డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'కలైంజర్ లైబ్రరీ'ని శుక్రవారం ప్రారంభించాను. అమింజికరై మార్కెట్ ప్రాంతంలోని ఈ లైబ్రరీని అన్నానగర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పార్టీ సభ్యులు, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరుతున్నాను. పుస్తకాల ద్వారా ప్రపంచాన్ని అధ్యయనం చేసేందుకు ఈ లైబ్రరీకి రావాలని ఉప ముఖ్యమంత్రి తన ఎక్స్‌లో పిలుపునిచ్చారు.


లైబ్రరీ ప్రారంభించి, పుస్తకాలు పరిశీలిస్తున్న ఉదయనిధి

తిరుప్పూరు సమీపంలో రైలు పట్టాలపై రాళ్లు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు - వంజిపాళయం మధ్య కావిలిప్పాళయం సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని దుండగులు రాళ్లను ఉంచారు. ఆ మార్గంలో వెళ్ళిన గూడ్సురైలు కింద ఆ రాళ్లు నలుగుతూ పెద్ద శబ్దం రావటంతో లోకోపైలట్ వెంటనే రైల్వే ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. దీంతో శుక్రవారం వేకువజామున రైల్వే భద్రతా దళం ఎస్ఐ రువంతికా, పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆ పట్టాల వద్ద పెద్ద రాళ్లు గూడ్సురైలు చక్రాల కింద నలిగి ఉండటాన్ని గమనించారు. సంఘటన స్థలానికి చేరువగా టాస్మాక్ దుకాణం ఉండటంతో మద్యం మత్తులో ఎవరైనా ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.


కావిలిప్పాళయం వద్ద పట్టాలను పరిశీలిస్తున్న రైల్వే పోలీసు అధికారులు



ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల ప్రకారం స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబ్రహ్మన కీర్తి ప్రతిష్ఠతలను ఎలుగెత్తి చాటేలా గిండి గాంధీమండపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు దామో అన్బరసన్, ఎం. సుబ్రమణ్యం, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **అన్నాసాలై:** వైట్స్ రోడ్డు కొంత భాగం, అన్నాసాలై కొంత భాగం, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ హోటల్, వాసన్ అవెన్యూ, రహేజా టవర్, జీపీ రోడ్డు, సత్యమూర్తి భవన్, ఈబీ కాంప్లెక్స్, క్లబ్ హౌస్, సిటీ టవర్, పటుల్లాస్ రోడ్డు, ఎక్స్‌ప్రెస్ అవెన్యూ, ఆర్ట్స్ కాలేజ్, బిన్ని రోడ్డు, వీసీ రోడ్డు, హోటల్ కాంచీ, ఇండియన్ బ్యాంక్, డీఎల్ఎఫ్, భాగస్ బిల్డింగ్, ఎతిరాజ్ కాలేజ్, శక్తి టవర్స్, సిటీ బ్యాంక్, మధుర బ్యాంక్, ఐఓబీ బ్యాంక్, రాణిమెయ్యమ్మ హాస్టల్, ఎయిర్ ఇండియా, అపోలో ఆసుపత్రి, మార్షల్ రోడ్డు, మాంటియత్ రోడ్డు, కెనరా బ్యాంక్, కన్నిమర హోటల్, డేటా సెంటర్, తాజ్ హోటల్.

రాష్ట్ర సరిహద్దుల్లో 45 చెక్‌పోస్టులు

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దుల్లోని 45 ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటుచేసినట్లు ఎక్సైజ్ తెలిపింది. ఈ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... గంజాయి, నకిలీ సారా, మాదక ద్రవ్యాలు అక్రమ తరలింపుపై ప్రజలు ఫిర్యాదు చేసేలా '10581' అనే టోల్ ఫ్రీ నెంబరు, 9498410581 అనే వాట్సాప్ నెంబరు పరిచయం చేశామన్నారు. ఈ నెంబర్ల ద్వారా 10 నెలల్లో 2,700 ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే, పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ తరలింపు అడ్డుకొనేలా రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన కోవై, కృష్ణగిరి, విల్లుపురం సహా 17 జిల్లాల్లో శాశ్వతంగా 45 చెక్‌పోస్టులు ఏర్పాటుచేసినట్లు, ఈ చెక్‌పోస్టుల వద్ద షిఫ్ట్ పద్ధతిన 24 గంటలు పనిచేసేలా పోలీసులను నియమించినట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

24 గంటల వ్యాపారాలకు అనుమతి

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): దుకాణాలు, వ్యాపార సంస్థలు 24 గంటలు పనిచేసే గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 5వ తేది మధురాంతకంలో జరిగిన వ్యాపారుల 42వ మహానాడులో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్... ప్రజల అవసరాల దృష్ట్యా దుకాణాలు, వాణిజ్య సంస్థలు అన్ని రోజులు 24 గంటలు పనిచేసేలా వెలువరించిన జీవో జూన్ 4వ తేదీతో ముగియనుందని, మరో మూడేళ్లు పొడిగిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో, దుకాణాలు, వాణిజ్య సంస్థలు జూన్ 5వ తేది నుంచి మూడేళ్లు 24 గంటలు అన్ని రోజులు పనిచేసేలా కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖ శుక్రవారం జీవో విడుదల చేసింది.

ఇంటి వద్దకే మొక్కల సరఫరా

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): మొక్కలు కొనుగోలుకు ఆసక్తి చూపేవారు, ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తే వారింటికే వెళ్లి అందజేయనున్నట్లు అటవీ శాఖ తెలిపింది. ఈ మేరకు అటవీ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో పచ్చదనం పెంచేలా 'పసుమై తమిళనాడు ఇయక్కం' ఏర్పాటు చేసామని, దాని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే పనులు చేపట్టామన్నారు. అలాగే, ప్రజలకు మొక్కలు అందించే కొత్త పక్రియ ప్రారంభించామన్నారు. ప్రజలు వెబ్‌సైట్ ద్వారా తమకు అవసరమైన మొక్కకు నగదు చెల్లిస్తే, మొక్కలు వారి ఇంటి వద్దకే అందజేస్తామని, వివరాలకు1800 599 7634 అనే నెంబరు సంప్రదించవచ్చు. ఈ ప్రక్రియ ప్రస్తుతం చెన్నైలో ప్రారంభించినట్లు, త్వరలో అన్ని జిల్లాలకు విస్తరించనున్నట్లు అటవీ శాఖ తెలిపింది.

జలాశయాల్లో 8.5 టీఎంసీల నీటినిల్వలు

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి తాగునీరందించే జలాశయాల్లో ప్రస్తుతం 8.5 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. నగర ప్రజలకు ఐదు జలాశయాల నుంచి నీరు సరఫరా చేస్తుంటారు. ఈ జలాశయాల పూర్తి సామర్థ్యం 11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.5 టీఎంసీల నీటి నిల్వలున్నాయని, ఈ ఏడాది చివరి వరకు నగర ప్రజలకు తాగునీటి కొరత ఉండదని అధికారులు తెలిపారు.

ప్లస్ టూ సప్లిమెంటరీ టైం టేబుల్ విడుదల

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల టైంటేబుల్ శుక్రవారం విడుదలైంది. ఆ ప్రకారం, జూన్ 25 నుంచి జూలై 2వ తేది వరకు పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు జరుగనున్నాయి. పాఠశాలల విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాల, ప్రైవేటు అభ్యర్థులు తాము పరీక్షలు రాసిన పాఠశాల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 25న తమిళం, ఇతర భాషలు, 26న ఇంగ్లీషు, 27న మ్యాథ్స్, జువాలజీ, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఇతర వృత్తి విద్య పాఠ్యాంశాలు, 28న కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ బయో కెమిస్ట్రీ, అడ్వాన్స్ లాంగ్వేజ్ (తమిళ్) సహా ఇతర పాఠ్యాంశాలు, 30న కెమిస్ట్రీ, అకౌంటెన్సీ, జియాగ్రఫీ, జూలై 1న బయాలజీ, బొటనీ, హిస్టరీ, బిజినెస్ మ్యాథమాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సహా ఇతర పాఠ్యాంశాలు, 2వ తేది ఫిజిక్స్, ఎకనామిక్స్, ఎంప్లాయిమెంట్ స్కిల్స్ తదితర పరీక్షలు జరుగనున్నాయి.

పేలవంగా రూ.2వేల పాస్ విక్రయాలు

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఆధ్వర్యంలో 50 ఏసీ బస్సులు సహా 3,056 బస్సులు నడుపుతున్నారు. ఏసీ బస్సులు మినహా మిగిలిన సాధారణ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించేలా రూ.320 నుంచి రూ.1,000 వరకు నెలవారీ బస్ పాస్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలో, ఏసీ బస్సుల్లోనూ ప్రయాణించేలా మార్చి 19వ తేది రూ.2,000 నెలవారీ బస్ పాస్ పరిచయం చేశారు. కానీ 300 మంది మాత్రమే రూ.2,000 పాస్‌లు కొనుగోలు చేశారు. ఈ విషయమై ప్రయాణికులు మాట్లాడుతూ... నగరంలో తగినన్ని ఏసీ బస్సులు లేవని, ధర కూడా ఎక్కువగా ఉందని, కొంత శ్రమ అయినా రూ.1,000 బస్ పాస్ సౌకర్యవంతంగా ఉందని వారు పేర్కొన్నారు.

ఉన్నత విద్య సందేహాల నివృత్తికి '14417'

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ తరువాత విద్యార్థులు ఏం చదవాలి, ఎక్కువ చదవాలి సహా పలు వివరాలను '14417' అనే టోల్ ఫ్రీ నెంబరులో సంప్రదించి తెలుసుకోవచ్చు. తల్లిదండ్రులు కూడా ఈ నెంబరు సంప్రదించి తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఉన్నత విద్యకు సంబంధించిన అన్ని వివరాలు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటలకు వరకు సంప్రదించి తెలుసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

కుమరిలో బోట్‌సవారీ వేళల పెంపు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో వివేకానంద స్మారక మండపం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకుల కోసం పూంపుహార్ షిప్పింగ్ కార్పొరేషన్ నడుపుతున్న బోట్ సవారీ సమయాన్ని మరో గంటపాటు పెంచింది. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఈ బోట్ సర్వీసును శుక్రవారం ఉదయం నుండి గంట ముందుగా అంటే ఉదయం ఏడుగంటలకే ప్రారంభించారు. ప్రస్తుతం వేసవి సెలవుల కారణంగా కన్నియాకుమారికి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పూంపుహార్ షిప్పింగ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడుపుతున్న బోట్లలో తిరువళ్లువర్ విగ్రహం, వివేకానంద స్మారక మండప ప్రాంతానికి వెళ్లేందుకు ఒకరికి రూ.75ల చొప్పున, క్యూలైన్లలో నిమిత్తం లేకుండా నేరుగా బోటెక్కి వెళ్లే ప్రయాణికుల నుండి తలా రూ.300ల చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నారు. పర్యాటకుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఉదయం నుండి టికెట్ కౌంటర్లు రోజూ ఉదయం 6.45 గంటలకు టికెట్ కౌంటర్లు తెరువనున్నట్లు పూంపుహార్ సంస్థ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) త్యాగరాజన్ తెలిపారు. జూన్ ఒకటి దాకా బోట్ సవారీ రోజూ ఉదయం 7 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని ఆయన ప్రకటించారు.


బోట్ సవారీకోసం బారులు తీరిన పర్యాటకులు

సీబీఎస్ఈ పాఠశాలల్లో 25శాతం రిజర్వేషన్ కోసం కేసు

● విద్యాశాఖ అధికారులకు నోటీసులు

ప్యారీస్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ర్టంలో ఆర్థికపరంగా వెనుకబడిన కుటుంబాల్లోని విద్యార్థులకు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో 25శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కోరుతూ దాఖలైన కేసులో రాష్ట్ర విద్యాశాఖ, సీబీఎస్ఈ, మెట్రిక్యులేషన్ పాఠశాలల ఉన్నతాధికారులను వివరణ కోరుతూ హైకోర్టు మదురై బెంచ్ నోటీసు పంపింది.. మదురైకు చెందిన ఇరన్యన్ దాఖలు చేసిన పిటిషన్‌లో, దేశంలో ఆర్థికపరంగా వెనుకబడిన కుటుంబాల్లో 6 నుండి 14ఏళ్ళ లోపున్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఈ చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాల్లో, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్‌పై సీట్లు కేటాయించాల్సివుంది. అయితే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉన్న సీబీఎస్ఈ పాఠశాలల్లో 25శాతం రిజర్వేషన్ కింద సీట్లు కేటాయించడంలేదని, ఇందుకు కారణం ప్రభుత్వం ఆ సీట్లకు సక్రమంగా ఫీజు చెల్లించడంలేదని పిటిషన్‌లో సూచించారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు దండపాణి, శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం ముందు శుక్రవారం విచారణకు వచ్చింది. ఇరుతరుపు వాదనల అనంతరం పిటిషన్‌కు సంబంధించి రాష్ట్రపాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, సీబీఎస్ఈ జోనల్ ఆఫీసర్, మెట్రిక్ పాఠశాల డైరెక్టర్, ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ నాలుగు వారాల్లోపు వివరణ సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

టాయిలెట్ సౌకర్యం లేక ఇక్కట్లు

పిటిషనర్‌కు రూ.12వేల పరిహారం ● వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో టాయిలెట్ సదుపాయం లేక ఇబ్బంది పడిన వ్యక్తికి, రూ.12వేల జరిమానా చెల్లించాలని వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు జారీచేసింది. చెన్నై ఉత్తర జిల్లా వినియోగదారుల ఫోరం ఇస్మాయిల్ అనే వ్యక్తి దాఖలుచేసిన పిటిషన్‌లో... 2024లో సూరపట్టు టోల్ ప్లాజా మీదుగా ప్రయాణించాను. ఆ సమయంలో టాయిలెట్‌కు వెళ్లాలని టోల్ ప్లాజా సిబ్బందిని కోరగా, కొంత దూరంలో ఉందని తెలిపారు. అలాగే, కి.మీ దూరంలో ఉన్న టాయిలెట్‌కు వెళ్లాను. కానీ, ఎవరూ వినియోగించకుండా తాళం వేసి ఉంది. దీంతో, టాయిలెట్ వెళ్లలేక మనస్తాపానికి గురయ్యాను. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ 2021లో విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం, దూరప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులు, ప్రయాణికుల కోసం టోల్ ప్లాజాల వద్ద టాయిలెట్, విశ్రాంతి గదులు ఏర్పాటుచేయాల్సి ఉంది. కానీ, సూరపట్టు టోల్ ప్లాజా నుంచి కి.మీ దూరంలో టాయిలెట్ ఉండడం, అది కూడా తాళం వేసి ఉందని, దీంతో ఇబ్బందులకు గురైన తనకు రూ.3 లక్షల పరిహారం చెల్లించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారించిన ఫోరం అధ్యక్షుడు గోపినాథ్, సభ్యులు కవితా కన్నన్, రామమూర్తి జారీ చేసిన ఉత్తర్వుల్లో... సూరపట్టు టోల్ ప్లాజా వరకు కొద్ది దూరంలో టాయిలెట్ ఏర్పాటుచేశారు. ఈ విషయమై కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొనలేము. కానీ, టాయిలెట్‌కు తాళం వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. టాయిలెట్ మూసివేసిన కారణంగా ఇబ్బందులు పడిన పిటిషనర్‌కు నష్టపరిహారంగా సదరు టోల్ ప్లాజా నిర్వహిస్తున్న సంస్థ రూ.10వేలు కేసు ఖర్చులకు రూ.2వేలు మొత్తం రూ.12వేలు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే సమయంలో టోల్ ప్లాజాల వద్ద మహిళలు, పురుషులకు వేర్వేరు టాయిలెట్లు ఏర్పాటుచేయాలని, అవినిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల శాఖకు ఉత్తర్వులు జారీచేశారు.

దారాపురంలో రైతుల వినూత్న నిరసన

ప్యారీస్, మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా దారాపురం అన్నానగర్‌లోని రైతు బజార్‌లో రైతులు శుక్రవారం ఉదయం కూరగాయలు పారబోసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ రైతు బజార్ సమీపంలోవున్న రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లపై కూరగాయలు, పండ్లు విక్రయించేందుకు చిల్లర వ్యాపారులను అనుమతించినందునరైతు బజార్‌లో వ్యాపారాలు మందగించి నష్టపోతున్నట్లు రైతులు పలుమార్లు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎటువంటి చర్యలు తీసుకోనట్లు తెలిసింది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాలనుండి శుక్రవారం తెల్లవారుజామున రైతు బజార్‌కు కూరగాయలు తరలించిన రైతులు కూరగాయలను పారబోసి ఆందోళన నిర్వహించారు.


కూరగాయలు పారబోసిన రైతులు

సమాచారం తెలిసి, అక్కడికి చేరుకున్న తాహసీల్దార్ ద్రవ్యం, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు రైతులతో చర్చలు జరిపారు. రైతు బజార్ సమీపంలోని పొల్లాచ్చి రోడ్డులో ఫుడ్‌పాత్ వ్యాపారులను మరో ప్రాంతానికి తరలిస్తామని అధికారులు ఇచ్చిన హామీతో రైతులు ఆందోళన విరమించుకున్నారు.

వైభవంగా షోలింగర్ నరసింహుడి రథోత్సవం

తిరుత్తణి, మే 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా షోలింగర్‌లో ప్రసిద్ధి చెందిన లక్ష్మీ నరసింహస్వామి వారి రథోత్సవం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామివారిని అలంకరించి రథంపై ఆశీనులను చేయగా, మంత్రి గాంధీ, ఎంపీ జగద్రక్షగన్ జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చంద్రకళ, ఎమ్మెల్యే మునిరత్నం, ఆలయ నిర్వాహకులు సహా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు.


రథోత్సవానికి హాజరైన భక్తులు


రథాన్ని లాగుతున్న మంత్రి గాంధీ, ఎంపీ జగద్రక్షగన్ తదితరులు

నాలుగు జిల్లాల్లో 26 ఇసుక రీచ్‌లు

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో కొత్తగా 26 ఇసుక క్వారీలు ప్రారంభించనున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 10కి పైగా ప్రాంతాల్లో ఇసుక క్వారీలు పనిచేస్తున్నాయి. ఈ క్వారీల నుంచి ఇసుకను లారీల ద్వారా యార్డ్ తరలించే పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. కాంట్రాక్టర్లలో నలుగురు చట్టవిరుద్ధంగా సుమారు రూ.4వేల కోట్లు నగదు బదిలీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఈడీ కేసు నమోదుచేసింది. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్న 10 క్వారీలు మూసివేశారు. క్వారీల మూసివేతతో ఇసుక కొరత ఏర్పడి నిర్మాణ రంగం తీవ్ర నష్టాలు చవిచూస్తోంది. ఈ క్రమంలో, విల్లుపురం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని కడలూరు జిల్లా చిదంబరం సమీపం కిళియనూరు, భువనగిరి తాలూకా ఆదనూరు, బన్రూటి తాలూకా వనపాక్కం తదితర ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ప్రారంభించేందుకు పర్యావరణ శాఖ అనుమతులు జారీచేసింది. ఇవి మినహా కడలూరు జిల్లాలో 14, రాణిపేటలో 4, వేలూరులో 3, విల్లుపురం జిల్లాలో 2 ఇసుక క్వారీలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఘన సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల నిర్వాహకులు

తిరుత్తణి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్లస్‌టూ ఫలితాల్లో తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ఆ పాఠశాల నిర్వాహకులు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కారించారు.

లైంగిక వేధింపుల కేసులో హెచ్‌ఎంకు 30 ఏళ్ల జైలుశిక్ష

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రధానోపాధ్యాయుడికి 30 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. దిండుగల్ జిల్లా ఒట్టాన్‌సత్రం ప్రాంతానికి చెందిన మురుగన్ (54) ఓ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2023లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్ఎం, ఈ విషయం ఎవరికి చెప్పకూడదని బెదిరించినట్లు సమాచారం. కానీ, హెచ్ఎం వేధింపులు భరించలేని విద్యార్థులు, ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు, ఒట్టాన్‌సత్రం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మురుగన్‌కు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ దిండుగల్ పోక్సో ప్రత్యేక కోర్టులో జరగగా నేరం నిరూపితం కావడంతో మురుగన్‌కు 30 ఏళ్ల జైలుశిక్ష, రూ.2.02 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వేల్‌మురుగన్ తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా పరిహారం అందజేయాలని సంబంధిత శాఖల అధికారులకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి తిరుకల్యాణం



తిరుత్తణి,మే9(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయంలో శుక్రవారం స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు ఈ నెల 1వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. అప్పటి నుండి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి వివిధ వాహనాల్లో మాడ వీధుల్లో విహరిస్తున్నారు. చిత్తిరై ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టమైన వళ్ళీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి తిరుకల్యాణోత్సవాన్ని వేదపండితులు శుక్రవారం ఉదయం నిర్వహించారు.ఉదయం 9గంటలకు స్వామివార్లను వెండి సింహాసనంపై కొలువుదీర్చి మాడవీధుల్లోఊరేగించారు. ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ శ్రీధరన్,జాయింట్‌కమిషనర్ రమణి, ధర్మకర్తలు ఉషారవి, సురేష్‌బాబు, మోహన్ పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారిపై శునకం దాడి

పెరంబూర్, మే (ఆంధ్రజ్యోతి: నగరంలో వాకింగ్ చేస్తున్న ఐఏఎస్ అధికారిపై పెంపుడు శునకం దాడి చేయడం కలకలం రేపింది. తేనాంపేటలోని వైద్య సేవల ఎంపిక బోర్డు ఛైర్‌పర్సన్‌గా ఐఏఎస్ అధికారి ఉమామహేశ్వరి వ్యవహరిస్తున్నారు. రాయపేటలో కుటుంబంతో నివసిస్తున్న ఆమె, శుక్రవారం ఉదయం తన భర్తతో బాలాజి నగర్‌లో వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో ఓ ఇంట్లో పెంచుకుంటున్న శునకం హఠాత్తుగా బయటకు వచ్చి ఐఏఎస్ అధికారిపై దాడి చేసింది. ఆమె వెంటనే ఆస్పత్రికి వెళ్లి టీకా వేయించుకుని ఇంటికి వెళ్లారు. శునకం యజమాని సురేష్‌పై ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

ఉప సర్పంచ్‌పై తప్పుడు కేసు

ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌కు రూ. లక్ష జరిమానా ● మానవ హక్కుల సంఘం ఆదేశం

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): మద్యం అలవాటు లేని పంచాయతి ఉప సర్పంచ్ మద్యం సేవించి వాహనం నడిపాడని కేసు నమోదుచేసి, చట్టవిరుద్ధంగా పోలీసు కస్టడీలో ఉంచిన ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ రూ. లక్ష జరిమానా విధిస్తూ మానవ హక్కుల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. కడలూరు ముదునగర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌కు, షణ్ముగం అనే వ్యక్తికి మధ్య జరిగిన వివాదానికి సంబంధించి 2018లో అన్నవల్లి పంచాయతి ఉప సర్పంచ్ వైద్యలింగం మధ్యవర్తిగా వ్యవహరించినట్లు సమాచారం. దీంతో సుధాకర్ కోపంగా వైద్యలింగం ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ముదునగర్ ఎస్ఐ ఏలుమలై సమక్షంలో వైద్యలింగాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి 11 గంటల వరకు ఉంచడంతో పాటు మద్యం సేవించి వాహనం నడిపాడని కేసు నమోదుచేశారు. ఈ వ్యవహారంపై వైద్యలింగం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... తనకు జరిగిన అన్యాయంపై కడలూరు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అలాగే, స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనం కూడా అప్పగించలేదని పిటిషన్‌లో పేర్కొన్నాడు. పిటిషన్ విచారించిన కమిషన్ సభ్యులు వి.కన్నదాసన్ పిటిషనర్‌కు మద్యం సేవించే అలవాటు లేకపోయినా, అతడిపై పోలీసులు తప్పుడు కేసు నమోదుచేయడం మానవ హక్కుల ఉల్లంఘన అన్నారు. ఈ కేసులో పిటిషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష పరిహారం చెల్లించాలని, ఆ మొత్తాన్ని ఎస్ఐ ఏలుమలై, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ నుంచి వసూలుచేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

ప్లస్ టూలో తల్లి ఫెయిల్... కుమార్తె పాస్...!


అనన్య-లావణ్య

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పరీక్షల్లో తల్లి ఫెయిల్ కాగా, కుమార్తె పాస్ అయింది. కోయంబత్తూర్‌కు చెందిన తల్లి లావణ్య-కుమార్తె అనన్యలు ఇటీవల జరిగిన ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాశారు. ప్లస్ టూ ఫలితాలు గురువారం విడుదలైన నేపథ్యంలో, కుమార్తె అనన్య 548 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కానీ, తల్లి లావణ్యకు 335 మార్కులు కాగా, ఎకనామిక్స్‌లో మాత్రం 32 మార్కులు రావడంతో ఫెయిల్ అయ్యారు.

మళ్లీ స్టాలిన్ ప్రభుత్వమే కావాలి

● బహిరంగ సభలో డీఎంకే నేతలు


సభలో మాట్లాడుతున్న డీఎంకే నేతలు

తిరుత్తణి, మే 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు మండలంలోని జంగాలపల్లి గ్రామంలో మండల కార్యదర్శి జి.రవీంద్రన్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్ చంద్రన్ పాల్గొని ప్రజా సంక్షేమార్థం రాష్ట్రప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేసిందని, ప్రజా సేవలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని నాయకులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని తెలిపారు. డీఎంకే అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు పూర్తైన సందర్భంగా ఆయన ప్రజలకు, నేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంకే నియోజకవర్గ ఇన్‌ఛార్జి షణ్ముగనాథన్, సంజీవిరాజు, గోవిందస్వామి, ఏకాంబరాజ్, రాజు, శివానందం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిమిషాంబ ఆలయ మహాకుంభాభిషేకం


గోపుర కలశాలకు, సన్నిధులకు కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన నిర్వాహకులు

ప్యారీస్, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట కాశీశెట్టివీధిలో కొలువైన నిమిషాంబ దేవాలయం పునరుద్ధరణ, జీర్ణోద్ధరణ అష్టబంధన కుంభాభిషేకం వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం 5 గంటలకు విఘ్నేశ్వర పూజ సహా అష్టోత్తరపూజలను నిర్వహించారు. పవిత్ర జల కలశాల ఊరేగించారు. మూలవర్, పరవార మూర్తుల సన్నిధుల్లో పూజల అనంతరం గోపుర కళశాలపై మహాకుంబాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులపై ఆలయ పూజారులు పవిత్ర జలాలను జల్లారు.. 300ఏళ్ళ చరిత్ర కలిగిన నిమిషాంబ దేవి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు చేపట్టి, పరమ శివుడు, వెంకటేశ్వరస్వామి, వినాయకుడు, బాల మురుగన్, నవగ్రహ సన్నిధులు నిర్మించారు. మారేడు చెట్టు స్థల వృక్షంగా భక్తులు పూజిస్తున్న ఈ ఆలయం ప్రస్తుతం మహాసన్నిధిగా రూపుదిద్దుకుంది. నిమిషాంబల్ భక్తజన సభ గౌరవాధ్యక్షుడు మన్నారు ఉదయ్‌కుమార్, గౌరవ కార్యదర్శులు సీపీ శేఖర్, ఇమ్మిడి కిషోర్, గౌరవ కోశాధికారి సూరిశెట్టి బాలాజీ, ఉపాధ్యక్షులు అమర్‌నాథ్, అశోక్‌కుమార్ తోడి, బీఎల్ కుమరవేల్, కమిటీ సభ్యులు పందిరి వీరన్న షావుకార్ల పర్యవేక్షణలో నేత్రపర్వంగా జరిగిన కుంబాభిషేకంలో రాష్ట్ర హిందూదేవాదాయశాఖ జాయింట్‌కమిషనర్ జె.ముల్లై, అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్, ఇన్స్‌పెక్టర్ సంపత్, ఆలయ ఈవో పి.మలైవాసన్, ఏఆర్ చంద్రశేఖర్‌రాజు సహా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఊరగాయపై జీఎస్టీ తగ్గించండి

● ఆహార పదార్థాల వ్యాపారుల సంఘం

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఊరగాయపై జీఎస్టీ పన్ను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని ఆహార పదార్థాల వ్యాపారుల సంఘం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల ప్రజలు ఆహారంలో ఊరగాయ తీసుకుంటుంటారు. పండ్ల నుండి తయారుచేసిన ఊరగాయల్లో సోడియం బెంజోయేట్ ఆమ్ల స్థాయి పెంచాలని, ఊరగాయపై విధిస్తున్న పన్ను తగ్గించాలని వ్యాపారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా రు. ఈ విషయమై ఆ సంఘం గౌరవ సలహాదారుడు ఎస్పీ జయప్రకాశం మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికంగా 800 కంపెనీలు, అనధికారంగా 8వేలకు పైగా కంపెనీలు ఊరగాయల ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. ఊరగాయ చెడిపోకుండా సోడియం బెంజోయేట్ ఆమ్లం వినియోగిస్తున్నామని తెలిపారు. మామిడి, నిమ్మకాయలు పండ్ల విభాగంలో చేర్చారన్నారు. వాటితో తయారుచేసిన ఊరగాయలు పరిశీలిస్తున్న అధికారులు, వాటిలో 250 మి.గ్రా కంటే సోడియం బెంజోయేట్ అధికంగా ఉందంటూ జరిమానా విధిస్తున్నారని తెలిపారు. ఈ పరిణామం తగ్గితే ఊరగాయ త్వరగా చెడిపోతుందన్నారు. అందువల్ల, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పండ్ల రకాల నుంచి తయారుచేసిన ఊరగాయల్లో సోడియం బెంజోయేట్ ఆమ్లం శాతం కేజీకి రూ.1,000 మి.గ్రాలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వినతిపత్రం సమర్పించామన్నారు. అలాగే, ఊరగాయలపై విధిస్తున్న 12శాతం జీఎస్టీ 5శాతానికి తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

గ్రేట్ లేక్స్‌లో పీజీ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రారంభం


పీజీ కోర్సుల ప్రారంభోత్సవానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరంతో గ్రేట్ లేక్స్ విద్యా సంస్థ నిర్వాహకులు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పి.చిదంబరం ఈ కోర్సులను ప్రారంభించారు. ఆ సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ అధిక సంపాదన వచ్చే కోర్సులపైనే విద్యార్థులు ఆసక్తి చూపించడం తగదని, న్యాయశాస్త్రం, వైద్య శాస్త్రానికి సంబంధించిన కోర్సులను చదివితే సమాజానికి సేవ చేయగలుగుతారన్నారు. ప్రస్తుత పోటీయుగంలో విద్యార్థులు తాము చదివే కోర్సులకు సంబంధించి ఏర్పడుతున్న మార్పులకు అనుగుణంగా తమ ప్రతిభా పాటవాలను కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రేట్ లేక్స్ డైరెక్టర్ డాక్టర్ డెబాసిష్ సన్యాల్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో నాగేంద్రన్ భేటీ

పెరంబూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ గురువారం గవర్నర్ ఆర్ఎన్ రవితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా ఉన్న పాకిస్తానీయులు, బంగ్లాదేశీయులను సత్వరం పంపించివేయాలని, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిని అరెస్ట్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ ఇటీవల బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. ఈ నేపథ్యంలో, గవర్నర్ ఆర్ఎన్ రవిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ గురువారం సాయంత్రం గిండిలోని రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో, రాష్ట్రంలో బసచేస్తున్న పాకిస్తానీయులను సత్వరం పంపించడం, రాష్ట్రంలో శాంతి భద్రతలు, రాజకీయ పరిస్థితుల గురించి చర్చించినట్లు సమాచారం.



ఆడియో రిలీజ్ దృశ్యం

సినీ ప్రముఖుల సమక్షంలో
'మైయల్' ఆడియో రిలీజ్

ఐకాన్ సినీ క్రియేషన్స్ ఎల్‌ఎల్‌పీ నిర్మాణంలో ఏజీపీ ఏళుమలై దర్శకత్వంలో రూపొందిన 'మైయల్' మూవీ ఆడియో, ట్రైలర్‌ను పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో విడుదల చేశారు. సేతు, సమృద్ధి తార ప్రధాన పాత్రలను పోషించారు. నగరంలోని ఓ థియేటర్‌లో తాజాగా జరిగిన ఈ వేడుకలో ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి, దర్శకులు పేరరసు, ఏళుమలై, కేఎస్ రవికుమార్, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీ ఉదయకుమార్, నిర్మాతలు ధనుంజయన్, అనుపమ విక్రమ్, పీఎల్ తేనప్పన్, గేయ రచయిత ఏకాదశి తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు ఆర్‌కె.సెల్వమణి మాట్లాడుతూ, దర్శకుడు కొత్త ప్రయత్నంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. హీరోయిన్ మన ఇంట్లోని అమ్మాయిలా ఉంది. హీరోకు మంచి భవిష్యత్ ఉంది' అని అన్నారు. నిర్మాత ధనుంజయన్ మాట్లాడుతూ, 'మైయల్' అనే టైటిల్‌కు ఉన్న అర్థాన్ని దర్శకుడు వివరించిన తీరు ఎంతో బాగుంది. అని అన్నారు. దర్శకుడు కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ, 'నిర్మాత తేనప్పన్ ఈ చిత్రం కోసం పనిచేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్రానికి టెక్నీషియన్లే ప్రధాన బలం. గ్రామీణ కథా చిత్రంగా లైవ్‌గా ఉంది. హీరోకు మంచి భవిష్యత్ ఉందని ప్రశంసించారు. దర్శకుడు ఆర్‌వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'మూవీలోని ప్రతి ఫ్రేమ్ ఎంతో అందంగా తీశారు. 'మైయల్' లేకుంటే మానవత్వమే లేదు. నిర్మాతలు రిస్క్ తీసుకోకుంటే ఒక రజనీకాంత్, కమల్ హాసన్ ఉండేవారు కాదు. నిర్మాతలు తాము చేసే పనిని సక్రమంగా చేస్తే చిత్రపరిశ్రమ బాగుంటుందన్నారు.

'థగ్‌లైఫ్' ఆడియో రిలీజ్ వాయిదా

● కమల్ హాసన్



మణిరత్నం దర్శకత్వంలో కమల్ హాసన్ హీరోగా నటించిన 'థగ్ లైఫ్' చిత్రం వచ్చే నెల 5వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని మూవీ ఆడియో రిలీజ్ వేడుకను భారీ స్థాయిలో నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే, భారత్ - పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న కారణంగా ఈ ఆడియో రిలీజ్ వేడుక వాయిదా వేస్తున్నట్టు చిత్ర నిర్మాతల్లో ఒకరైన కమల్ హాసన్ ప్రకటించారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మన దేశ సరిహద్దుల్లో జరుగుతున్న పరిణామాలు, ప్రస్తుత హెచ్చరికలు దృష్ట్యా మే 16వ తేదీన జరగాల్సిన 'థగ్‌లైఫ్' ఆడియో లాంచ్ వేడుక వాయిదా వేస్తున్నాం. మళ్ళీ రీ షెడ్యూల్ చేయాలని మేం నిర్ణయించుకున్నాం. మన సైనికులు దేశ రక్షణలో ధైర్యసాహసాలతో ముందు నిలబడివున్నందున ఇది వేడుకలు చేసుకునే సమయం కాదని, నిశ్శబ్ద సంఘీభావాన్ని తెలిపే సమయంగా నేను భావిస్తున్నాను. దేశం తర్వాతే కళలు (ఆర్ట్స్). కొత్త తేదీ త్వరలోనే ప్రకటిస్తాం. ఈ సమయంలో ఆలోచనలన్నీ మన దేశాన్ని రక్షిస్తూ, అప్రమత్తంగా ఉండే మన సాయుధ దళాల్లోని ధైర్యవంతులైన స్త్రీపురుషుల పట్ల మన ఆలోచనలు ఉండాలి. పౌరులుగా సంయమనం, సంఘీభావంతో స్పందించడం మన విధి' అని పేర్కొన్నారు. అగ్రనటుడు కమల్ హాసన్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ స్వాగిస్తున్నారు. కాగా ఈ చిత్రాన్ని మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్‌తో కలిసి కమల్ హాసన్ తన సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించారు.

దుష్ప్రచారం చేసే వారిని దేవుడు చూసుకుంటారు

● యోగిబాబు



తన గురించి దుష్ప్రచారం చేస్తున్నవారిని ఆ దేవుడు చూసుకుంటారని ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'జోర కై తట్టుంగా' సినిమా ఆడియో రిలీజ్ వేడుక గురువారం రాత్రి నగరంలో జరిగింది. ఇందులో యోగిబాబు మాట్లాడుతూ 'ఒక చిత్రం ఆడియో రిలీజ్ వేడుకకు రాలేదని నా గురించి ఏదేదో మాట్లాడారు. నా వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన ఒక వ్యక్తి సినిమా తీస్తున్నారు. అతను ప్రాధేయపడటంతో రెండు రోజుల పాటు షూటింగ్‌కు వెళ్ళాను. 'గజానా' చిత్రం ఆడియో రిలీజ్ వేడుకకు నేను రాలేకపోవడంతో రూ.7 లక్షలు డబ్బు డిమాండ్ చేసినట్టుగా ప్రచారం చేశారు. ఇందులో ఏమాత్రం నిజం లేదు. నా పారితోషికాన్ని నేను నిర్ణయించడం లేదు. ఇంకా చెప్పాలంటే నా రెమ్యునరేషన్ ఎంతో కూడా నాకు తెలియదు. బయట ప్రపంచంలోనే తీర్మానిస్తున్నారు. చిత్రపరిశ్రమలో నాకు ఎంతెంత బాకీ ఉందో తెలుసా? ఆ డబ్బులు మీరు ఇప్పించగలరా? డబ్బులు ఇవ్వాల్సిన వారి జాబితా చెప్పమంటారా? నోటికొచ్చినట్టు ఏది పడితే అది మాట్లాడొద్దు. నేను ప్రతి ఒక్కరితోనూ సర్దుకుని పోయే వ్యక్తిని. నా గురించి మాట్లాడేవారు మాట్లాడుకోనివ్వండి. అలాంటి వారిని ఆ దేవుడు చూసుకుంటారు' అన్నారు. ఈ వేడుకకు అతిథిగా హాజరైన ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను మాట్లాడుతూ, 'నిజం చెప్పాలంటే నిర్మాతలకు యోగిబాబు ఎంతో సాయం చేస్తారు. ఆయన మనసు కష్టపడకూడదు' అని పేర్కొన్నారు.


నటుడు సౌందరరాజాకు 'కలైమగన్' అవార్డు

చిత్రజ్యోతి

నార్వే ఫిల్మ్ ఫెస్టివల్‌లో నటుడు సౌందరరాజాకు 'కలైమగన్' అనే అవార్డు ప్రదానం చేశారు. కోలీవుడ్‌లో ప్రముఖ నటుడైన సౌందరరాజా అనేక చిత్రాల్లో విభిన్న పాత్రలను పోషించి తనకంటూ ఓ ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. తమిళంలో అనేక మంది స్టార్ హీరోలతో కలిసి నటించారు. అలాగే, తన సొంత ఖర్చుతో అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. ఇందుకోసం 'మన్నుక్కుం మక్కలుక్కుం' అనే పేరుతో చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా అనేక మంది పేదలకు సాయం చేయడంతో పాటు మొక్కల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తున్నారు. సినిమాలకు అతీతంగా సామాజిక సేవలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా, నార్వే ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు 'కలైమగన్-2025' అనే అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డు అందుకోవడంపై ఆయన మాట్లాడుతూ, 'నేను 15 యేళ్ళకుపైగా చిత్ర పరిశ్రమలో ఉన్నాను. 50కి పైగా చిత్రాల్లో నటించాను. సమాజంతో పాటు ప్రకృతి పరిరక్షణపట్ల తనకున్న అనుబంధం కారణంగా గత పదేళ్ళుగా నా ట్రస్ట్ ద్వారా అనేక సంక్షేమ పథకాలతో పాటు ధార్మిక కార్యకాలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాను' అని వివరించారు.



అవార్డు స్వీకరిస్తున్న సౌందరరాజా





చెన్నైలో జరిగిన వేల్స్ విద్యా సంస్థల అధినేత, సినీ నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ కుమార్తె ప్రీతి గణేష్, లుష్విన్ కుమార్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన అగ్ర నటులు రజనీకాంత్, కమల్ హాసన్. ఈ వివాహ వేడుకకు తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేక నటీనటులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో రామ్‌రాజ్ షోరూం



షోరూంను ప్రారంభిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన 'రామ్‌రాజ్ కాటన్' షోరూం చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటైంది. శుక్రవారం దీనిని సదరన్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.బేజి జార్జ్ ప్రారంభించగా, చెన్నై డివిజనల్ రైల్వే మేనేజర్ బి.విశ్వనాథ్ ఈర్య జ్యోతిప్రజ్వలన చేశారు. ఏడీఆర్‌ఎం తేజ్ ప్రతాప్ సింగ్ తొలి కొనుగోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తాము చేసే అన్ని ఉత్పత్తులు మృదువైన కాటన్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేయబడతాయన్నారు. వీటిని వస్త్ర పరిశ్రమ నిపుణులు రూపొందించి విక్రయిస్తారని, ధోతీలు, చొక్కాలు, బనియన్లు దక్షిణభారతదేశంలోనే కాకుండా ఉత్తర భారతంతో పాటు బయటి రాష్ట్రాల్లో కూడా అందుబాటులో వున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ధోతీల అమ్మకాలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఏకైక కంపెనీ రామ్‌రాజ్ కాటన్ అనే విషయం అందరికీ తెలుసని పేర్కొన్నారు.

దొడ్డబెట్ట వ్యూ పాయింట్ సందర్శనకు
పర్యాటకులకు అనుమతి

చెన్నై, మే 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో తప్పకుండా సందర్శించాల్సిన పర్యాటక ప్రాంతంగా పేరుగడించిన దొడ్డబెట్టా వ్యూ పాయింట్‌ను సందర్శించేందుకు శుక్రవారం ఉదయం నుండి పర్యాటకులను అనుమతించారు.



నాలుగు రోజులకు ముందు ఆ ప్రాంతంలో అడవి ఏనుగు సంచరించడంతో పర్యాటకులు వెళ్ళకుండా అటవీ, పోలీసు శాఖ అధికారులు నిషేధం విధించారు. ఆ తర్వాత గత మూడు రోజులుగా అటవీ శాఖ అధికారులు ఏనుగు ఆచూకీ కోసం ముమ్మరంగా గాలించినా, కనిపించలేదు. దొడ్డబెట్టా ప్రాంతానికి దూరంగా ఆ ఏనుగు దట్టమైన అడవిలోకి వెళ్ళి ఉంటుందని భావించి శుక్రవారం ఉదయం నుండి పర్యాటకులను అనుమతించారు.



ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయం సమీపంలో రూ.3.22 కోట్లతో నిర్మించిన గృహ సముదాయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి, చిత్రంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్, మేయర్ ఆర్. ప్రియ తదితరులు



ఎంతోమంది నాట్య కళాకారులకు అవకాశాలు అరుదుగా వస్తుంటాయి. ప్రదర్శన వేదిక ఎక్కడ? ఎవరిని సంప్రదించాలి? ఇలా పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతుంటాయి. వాటిపై అవగాహన లేక కొందరు, నిర్వహణశక్తి లేక ఇంకొందరు, సమయం అనుకూలించక మరికొందరు నాట్యప్రదర్శనలో అవకాశాలు కోల్పోతున్నారు. అటువంటి వారికి చేయూతగా ఒక సంస్థ ఉందని తెలిస్తే ఎంత ఆనందం! ఆ సంస్థ గురించి తెలుసుకోవాలనుకుంటున్నారా? దాని పేరే 'శ్రీ భారత్ కళాఆర్ట్స్ అకాడమీ'. కూచిపూడి నాట్య గురు రోజారాణి ఆ అకాడమీ వ్యవస్థాపకురాలు. ఆమె నాట్యప్రస్థానం, అకాడమీ ఏర్పాటు తదితర అంశాలు ఈనాటి తరుణిలో....

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

తన శిష్యురాళ్లతో..



తరుణి

నాట్యానికి ప్రాధాన్యం ● గురు రోజారాణి
ప్రదర్శనలకు ప్రోత్సాహం



టీటీడీ ఆలయంలో...

ఎస్.రోజారాణి విజయవాడలో జన్మించారు. ఆమె తల్లి రాజకుమారి. ఆమెకు శాస్త్రీయసంగీతంలో ప్రవేశం ఉంది. తండ్రి ప్రభాకర రావు ఇంజనీర్. రోజారాణికి ఇద్దరు సోదరులు, ఇద్దరు చెల్లెల్లు, ఏడవ తరగతి వరకు విజయవాడలోనే పాఠశాల విద్యాభ్యాసం జరిగింది. ఆపై చెన్నైలో స్థిరపడడంతో 12వ తరగతి వరకు టి.నగర్‌లోని 'ఆదర్శ విద్యాలయం'లో కొనసాగించారు. దూరవిద్య ద్వారా అన్నా యూనివర్శిటీ నుంచి బికామ్ డిగ్రీ పొందారు.

నాట్యాభ్యాసం.....

రోజారాణికి బాల్యంలోనే నాట్యంపై ఆసక్తి వుంది. కుమార్తె అభిలాషను తల్లి దండ్రులు గమినించారు. తల్లి ప్రోత్సాహంతో రోజారాణి విజయవాడలోని ఘంటసాల అకాడమీలో కూచిపూడి నాట్యంలో శిక్షణకు శ్రీకారం చుట్టారు. ఏడేళ్ల ప్రాయంలో ప్రారంభించిన కూచిపూడి నాట్యం, 18 సంవత్సరాల పాటు కొనసాగింది. ఆ తర్వాత చెన్నైలోని వెంపటి చినసత్యం కూచిపూడి ఆర్ట్స్ అకాడమీలో చేరి వారి వద్ద మరో 8ఏళ్ళు నాట్యాభ్యాసం చేశారు. తర్వాత అంబికేశ్వర నృత్యానికేతన్ గురువు ఆనంద్ శిష్యరికంలో 10 సంవత్సరాలు శిక్షణపొంది కూచిపూడి నాట్యంలో ప్రావీణ్యం సంపాదించారు.



నాట్య ప్రదర్శనలు...

రోజారాణి దేశంలోని ఎన్నోప్రాంతాల్లో కూచిపూడి ప్రదర్శనలతో ప్రేక్షకుల ప్రశంసలందుకున్నారు. బాల్యంలోనే నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించిన రోజారాణికి విజయవాడ, ఢిల్లీ, బొంబాయి, జైపూర్, కేరళ, హైదరాబాదు తదితర ప్రాంతాలు నాట్యప్రదర్శనకు వేదికలయ్యాయి. అంతేకాదు సింగపూర్, మలేసియా వంటి దేశాల్లో కూడా తన నృత్యంతో అక్కడి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నాట్య సంగీతాలను ప్రోత్సహించే చెన్నై నగరంలో రోజారాణి మ్యూజిక్ అకాడమీ, నారద గానసభ తదితర సభల్లోనూ వందకు పైగా ప్రదర్శనలిచ్చారు. తిరుమల నాదనీరాజనం వేదికపై నృత్య ప్రదర్శన చేశారు. 25 సంవత్సరాలు తన నాట్యాభినయంతో ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్న రోజారాణిని పలు అవార్డులు వరించాయి. మహాబలిపురం, చిదంబరం, తంజావూరు మొదలైన దేవాలయాల్లో పండుగల సందర్భాల్లో కూడా ఆమె తన నాట్య వైభవాన్ని ప్రదర్శించారు. ఆమె నాట్య ప్రదర్శనలకు చెన్నై నగరంలో ఎంతోమంది సినీప్రముఖులు, రాజకీయ నాయకులు కూడా హాజరయ్యారు.

అకాడమీ స్థాపన....

నాట్యప్రదర్శనకు ముందుగా పలు అంశాలపై దృష్టిసారించాల్సిన అవసరాన్ని రోజారాణి గుర్తించారు. వేదిక ఎంపిక, నిర్వాహకులతో సంప్రదింపులు, నిర్వహణ బాధ్యతలు తదితర విషయాల్లో ఎంతో అనుభవం సంపాదించిన ఆమె తన తోటి నాట్యకళాకారులకు తనవంతు సేవలందించాలని భావించారు. దాని ఫలితంగా 'భారత్ కళా ఆర్ట్స్ అకాడమీ' పురుడుపోసుకుంది. నాట్యప్రదర్శన ఇవ్వాలని ఆసక్తి ఉన్నా.. అవకాశాలు లేక, అవగాహన లేక ఎందరో కళాకారులు తెరవెనకే ఉండడం గ్రహించి, వారి ప్రతిభను వెలికి తీసి, వారికి తన అకాడమీ ద్వారా అవకాశాలు కల్పిస్తున్నారు.తనను సంప్రదించిన ఎందరో నాట్యగురువులకు, కళాకారులకు వివిధ ప్రాంతాల్లో నాట్యప్రదర్శనలు ఏర్పాటు చేసినిర్వహణ బాధ్యతలను చేపట్టారు. 'భారత్ కళా ఆర్ట్స్ అకాడమీ' వ్యవస్థాపకురాలిగా, డైరెక్టర్‌గా సేవలందిస్తున్న రోజారాణికి, ఆమె సోదరుడు దుర్గానటరాజ్ సహాయ సహకారాలను అందించడమే గాక, అకాడమీకి డైరెక్టర్‌గా, ఆర్గనైజర్‌గా పనిచేస్తూ అకాడమీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

"నాట్యంలో అభిరుచి ఉన్న పిల్లలను వారి తల్లిదండ్రులు తప్పక ప్రోత్సహించాలి. మన నాట్యకళలు దేశ,విదేశాల్లో వ్యాప్తిచెందాలి. నాట్యాభ్యాసం చేసే వారు నాట్యాన్ని దైవంగా భావించి ఏకాగ్రతతో, నిబద్ధతతో అభ్యసించాలి. ఏ కళ అయినా క్రమశిక్షణ, కఠోర పరిశ్రమతోనే అబ్బుతుంది... అభివృద్ధి చెందుతుంది." అంటూ రోజారాణి 'తరుణి'తో తన మనోభావాలను పంచుకున్నారు.

అళగర్‌కోవిల్ చిత్తిరై ఉత్సవాలు ప్రారంభం

● 12న వైగైనదీ ఆగమనోత్సవం ● 496 మండపాల్లో దివ్యదర్శనం



బంగారంతో తయారైన కళ్ళలగర్ ఉత్సవ విగ్రహం

టి.నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో భారీ యెత్తున నిర్వహించే ఆలయ వేడుకల్లో మదురై చిత్తిరై ఉత్సవాలు ప్రఖ్యాతిగడించాయి. ఓ వైపు మీనాక్షి అమ్మవారి ఆలయంలో, మరో వైపు అళగర్‌మలై ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు నిర్వహించడంతో మదురై నగరంతోపాటు శివారు ప్రాంతాలన్నీ పండుగ వాతావరణం చోటుచేసుకుంది. మీనాక్షి అమ్మవారి చిత్తిరై వేడుకలు జరుగుతున్న సమయంలోనే అళగర్‌మలై ఆలయంలో కోడైవిళా (చిత్తిరై ఉత్సవాలు) గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల అంకురార్పణ ఫిబ్రవరి 3న తల్లాకుళం పెరుమాళ్ ఆలయంలో సప్పర ముహూర్త ఉత్సవం జరిగింది. ఆ తర్వాత ఏప్రిల్ 27 ఉదయం అళగర్‌మలై ఆలయం వద్ద ముహూర్త స్తంభ స్థాపన జరిగింది. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తికావటంతో గురువారం చిత్తిరై ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆరుగంటలకు తోళుక్కినియాన్ వాహనంలో స్వామివారు ఊరేగారు. ఈ నెల 10న సాయంత్రం ఆరుగంటలకు అళగర్‌మలై నుంచి స్వామివారు స్వర్ణపల్లకీలో మదురై నగరానికి బయలుదేరనున్నారు. 11న ఉదయం 6 గంటలకు మూన్రుమావడి ప్రాంతానికి చేరుకుంటారు. మదురై నగర భక్తులంతా ఆ స్వామివారిని ఆహ్వానించే ఎదురుసేవలు నిర్వహిస్తారు. ఈ నెల 12 వేకువజామున ఉత్సవాల్ట ప్రధానఘట్టమైన కళ్ళలగర్ వైగైనదిలో స్వర్ణ అశ్వవాహనంలో ప్రవేశించనున్నారు. సుమారు పది లక్షల మంది భక్తులు వైగైనదిలో స్వామివారిని దర్శించుకోనున్నారు. కళ్ళలగర్ మదురై నగర ఆగమన వేడుకల్లో దారి పొడవునా 496 మండపాల్లో వేంచేసి భక్తులకు దర్శనమివ్వనున్నారు. 13న గరుడ వాహనంలో తేనూరు మండపంలో మండూక మహర్షికి మోక్షాన్ని ప్రసాదిస్తారు. అదే రోజు రాత్రి రామరాయమండపంలో వేంచేసి మరుసటి రోజు వేకువజాము వరకే స్వామివారు దశావతార అలంకరణతో భక్తులకు కనువిందు చేయనున్నారు. 14 రాత్రి సేతుపతి మండంలో జరిగే పూలపల్లకీ ఉత్సవంలో పాల్గొంటారు. 15 ఉదయం అక్కడి నుంచి అళగర్ మలైకి బయలుదేరుతారు. ఈ నెల 16 ఉదయం 10 గంటలకు కళ్ళలగర్ స్వామి అలగర్‌మలై చేరుకుంటారు. ఈ నెల 17 సాత్రుముదైతో స్వామవారి కోడైవిళా ముగియనుంది. ఈ ఉత్సవాలకు సంబంధించి అళగర్ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ వెంకటాచలం, డిప్యూటీ కమిషనర్ యజ్ఞనారాయణ, ట్రస్టు బోర్డు సభ్యులు స్వయంగా పరిశీలించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు.

బంగారంతో కళ్ళలగర్ విగ్రహం...

తమిళంలో రామాయణాన్ని రచించిన కవికంబర్‌కు శ్రీరాములవారి జననం సందర్భంగా ఆ పసికందు ముఖారవిందాన్ని దేనితో పోల్చటమో తెలియక సతమతమయ్యారు. చివరకు అపరంజి లాంటిముఖమని వర్ణించారు. ఇదే రీతిలో కల్లలగర్ స్వర్ణ విగ్రహాన్ని రూపొందించాలనుకున్నవారికి కూడా కవిచక్రవర్తి కంబర్‌లాగే ఎలాంటి బంగారంతో ఆ విగ్రహాన్ని తయారు చేయాలా అని అయోమయంలో పడ్డారు. ఎలాంటి బంగారంతో తయారు చేసిన కళ్ళలగర్ అందానికి సాటిరాదని భావించారు. తమిళంలో మంచి గుణగణాలు కలిగిన వ్యక్తిని, సద్గుణాలు కలిగిన పెళ్ళీడు యువతి గురించి చెప్పేటప్పుడు 'పత్తరై మాట్రు తంగం' అంటూ వర్ణించడం ఆనవాయితీ. పత్తరై మాట్రు తంగం అంటే పది భాగాలు బంగారు అర్ధభాగం రాగి కలిపిన బంగారం అని అర్థం. అలాంటి అపరంజితోనే కళ్ళలగర్ విగ్రహాన్ని తయారు చేశారు. ప్రస్తుతం దేశంలో రెండు అపరంజి ఉత్సవ విగ్రహాలు మాత్రమే ఉన్నాయి. అందులో ఒకటి కళ్ళలగర్ విగ్రహం కాగా మరొకటి తిరువనంతపురం పద్మనాభస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహమని భట్టార్లు చెబుతున్నారు. ప్రస్తుతం అళగర్ ఆలయంలోని ఉత్సమూర్తికి అళగర్ పర్వతంపైనున్న నూపుర గంగాతీర్థం జలాలతోనే అభిషేకం చేస్తారు. ఇతర కొలనులలోని జలాలను వాడితే విగ్రహం నల్లబడుతుందని భావించే పవిత్రమైన నూపుర గంగాతీర్థ జలాలతో అభిషేకం చేస్తున్నారు.

క్రెడాయ్- ఎన్ఐటీటీటీఆర్ సంస్థలతో వీఐటీ ఒప్పందం

ప్యారీస్, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యా, పారిశ్రామిక రంగాల్లో సహకారాన్ని ప్రోత్సహించడానికి ఎన్ఐటీటీటీఆర్ చెన్నై, క్రెడాయ్ చెన్నై సంస్థలతో వీఐటీ చెన్నై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. నగరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ (ఎన్ఐటీటీటీఆర్), కన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవెలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) సంస్థలతో వీఐటీ చెన్నై రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం, ఎన్ఐటీటీటీఆర్ చెన్నై డైరెక్టర్ డాక్టర్ ఉషా నటేశన్, క్రెడాయ్ చెన్నై ఛైర్మెన్ ఎ.మహ్మద్ అలీలు సంతకాలు చేశారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ, క్రెడాయ్- ఎన్ఐటీటీటీఆర్ (చెన్నై) సంస్థలతో తాము కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ద్వారా వినూత్న పరిశోధనలు, అత్యాధునిక శిక్షణ, మేథోమార్పిడి సహా ఉమ్మడి పరిశోధన దిశగా నాణ్యమైన విద్య అందించేందుకు సహకరిస్తుందని తెలిపారు. ప్రపంచ దేశాలకు భవిష్యత్తులో అవసరమైన నిపుణులను అందించేందుకు, ఇలాంటి ఎంవోయూలు, విద్యార్థులు, ప్రొఫెసర్లు, అభివృద్ధి దిశగా ముందుకెళ్ళేందుకు తమ విద్యాసంస్థలు కృషిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఐటీ చెన్నై ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ త్యాగరాజన్, అడిషనల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మనోహరన్, ప్రొఫెసర్ నయీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సంస్థల నిర్వాహకులు

